సాక్షి
తిరుపతి

ఆదివారం । 24 । సెప్టెంబర్ । 2023



జంతువులను సంరక్షిద్దాం
జంతువుల సంరక్షణపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి పిలుపునిచ్చారు.
- 8లో



ఘనంగా చండీయాగం
సూళ్లూరుపేట శ్రీచెంగాళమ్మ పరమేశ్వరి ఆలయంలో ఎమ్మెల్యే కిలివేటి దంపతులు చండీయాగాన్ని ఘనంగా నిర్వహించారు.
- 8లో

	గరిష్ఠం	కనిష్ఠం
తిరుపతి	34	25
చిత్తూరు	33	24
తిరుమల	29	20
గూడూరు	36	27
నగరి	35	25

న్యూస్‌రీల్

ఎస్వీయూలో 26న జాబ్ మేళా

తిరుపతి సిటీ : ఎస్వీ యూనివర్సిటీ ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయంలో ఈ నెల 26వ తేదీ ఉదయం 9.30 గంటలకు మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసర్ టీ.శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాలో భార్గవి ఆటోమోబైల్స్, ఎస్‌బీటీ మెడికేర్, అపోలో ఫార్మసీ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని, సుమారు 206 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. పది, ఐటీఐ, ఇంటర్, డిప్లొమో, ఫార్మసీ, బీటెక్, డిగ్రీ, పీజీ కోర్సులు పూర్తిచేసిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. వివరాలకు ఎస్వీయూనివర్సిటీలోని ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయంలో సంప్రదించవచ్చని ఆయన సూచించారు.

నేటి నుంచి విజయవాడ-చెన్నై మధ్య వందేభారత్



మాట్లాడుతున్న స్టేషన్ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు

గూడూరు రూరల్: విజయవాడ- చెన్నై మార్గంలో ఆదివారం నుంచి నూతన వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రారంభమవుతుందని గూడూరు రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం స్థానిక రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదివారం ప్రారంభించే నూతన వందే భారత్ రైలు సాయంత్రం 5 గంటలకు గూడూరుకు చేరుకుంటుందన్నారు. ఈమేరకు స్వాగత కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు వెల్లడించారు. డీఆర్‌యూసీసీ సభ్యుడు శ్యామ్‌యాదవ్, కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్‌పీఎఫ్ సీఐ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆదాయం రూ.1.10 కోట్లు

తిరుపతి అర్బన్: తిరుమల బ్రహ్మోత్సవాల్లో శుక్రవారం జరిగిన గరుడోత్సవానికి 4,891 ఆర్టీసీ సర్వీసుల్లో 1,29,952 మందిని తిరుమలకు తరలించినట్టు సంబంధిత అధికారులు తెలిపారు. దీంతో ఆర్టీసీకి రూ.1.10 కోట్ల రాబడి వచ్చిందన్నారు. మరోవైపు పెరటాసి శనివారం సందర్భంగా తమిళనాడుతోపాటు పలు ప్రాంతాలకు అదనపు సర్వీసులు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

అలరించిన 'ప్రాసమణి' పద ప్రవాహం



విద్యార్థినికి జ్ఞాపికను బహూకరిస్తున్న శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్

సత్యవేడు: శ్రీసిటీ ఆధ్యాత్మిక సాహిత్య వేదిక శ్రీవాణి ఆధ్వర్యంలో శనివారం స్థానిక శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద నిర్వహించిన సాహిత్య కార్యక్రమంలో ప్రాసమణిగా వాసికెక్కిన అన్నదాత మణి పద ప్రవాహ ప్రదర్శన ప్రేక్షకులను విశేషంగా అలరించింది. 'ప్రకృతి ఒడిలో పరిశ్రమలు' అనే అంశంపై పాటలు, పద్యాలు, ఛలోక్తులతో ప్రాసయుక్తంగా సాగిన ఆయన ఉపన్యాసం సభికులను ఆకట్టుకుంది. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ప్రాస మణికి కృతజ్ఞతలు తెలిపారు. 'నువ్వే ఔషధం' అనే సామెతను పురస్కరించుకొని ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు వెల్లడించారు. చిత్రలేఖనంలో అద్భుత ప్రతిభ కనబరిచిన స్థానిక అకార్డ్ స్కూల్ 10వ తరగతి విద్యార్థిని త్రిపురాంతకం ప్రియ సుదర్శినిని ఆయన ఆత్మీయంగా సత్కరించారు. ఆమెకు జ్ఞాపికను బహూకరించారు.

రామయ్య తీరున.. బంగారు తేరున..



పెరిగినాడు చూడరో పెద్ద హనుమంతుడు



బ్రహ్మమొక్కటే పరబ్రహ్మమొక్కటే!



రంగ రంగ రంగపతి రంగనాథ!

- అంగరంగ వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు
- ఆరో రోజు మూడు వాహనాలపై విహరించిన ముగ్ధమనోహరుడు
- ఉదయం హనుమంత, సాయంత్రం స్వర్ణరథం, రాత్రి గజ వాహనంపై ఊరేగిన మలయప్ప

తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. ఆరో రోజు శనివారం మలయప్ప స్వామి మూడు వాహనాల్లో ఊరేగుతూ మురిపించారు. ఉదయం భక్తుల్లో అగ్రగణ్యుడైన హనుమంత వాహనాన్ని అధిరోహించి భక్తులను అనుగ్రహించారు. సాయంత్రం ధగధగా మెరుస్తున్న స్వర్ణరథంపై విహరిస్తూ ఆకట్టుకున్నారు. రాత్రి గజవాహనంపై తిరుగుతూ కనువిందుచేశారు. దేవదేవుని దివ్యమంగళరూపాన్ని దర్శించి భక్తులు పునీతులయ్యారు. వాహన సేవల ముందు కళాబృందాల ప్రదర్శన ఆకట్టుకుంది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లను ఆలయ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈఓ ఏవీ.ధర్మారెడ్డి పర్యవేక్షించారు. - తిరుమల



గజ గోవిందం



శ్రీరాముడి అలంకరణలో కళాకారులు

స్వర్ణరథంపై స్వామి, అమ్మవార్లు

మావూరి దేవుడు.. అందాల రాముడు!

- అంగరంగ వైభవంగా తుమ్మలగుంట బ్రహ్మోత్సవాలు
- హనుమంతునిపై శ్రీరామ చంద్రుని విహారం
- సారె సమర్పించిన చంద్రగిరి వాసులు
- శ్రీరాముని అవతారంలో కల్యాణ వెంకన్న

తిరుపతి రూరల్: తుమ్మలగుంట శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరో రోజు శనివారం ఉదయం మలయప్ప స్వామి హనుమంత వాహనంపై శ్రీరాముని అవతారంలో విహరిస్తూ భక్తులకు అభయమిచ్చారు. అంతకుముందు వాహన మండపంలో స్వామివారిని పట్టువస్త్రాలు, స్వర్ణాభరణాలతో శ్రీరాముని అవతారంలో విశేషంగా అలంకరించారు. అనంతరం స్వామి వారు హనుమంత వాహనాన్ని అధిరోహించి ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. వాహన సేవలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దంపతులు, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడో రోజు ఆదివారం స్వామి వారు ఉదయం సూర్యప్రభ వాహనంపై, రాత్రి, చంద్రప్రభ వాహనంపై భక్తులకు దర్శనమిస్తారు.

సారె సమర్పణ

హనుమంత వాహన సేవకు చంద్రగిరి మండలం తొండవాడ, శానంబట్ల, పిచ్చినాయుడుపల్లి, దోర్నకంబాల, గంగుడుపల్లి, బుచ్చినాయుడుపల్లి, మిట్టపాళెం గ్రామాలకు చెందిన ప్రజలు సారెను సమర్పించారు.

వేడుకగా వసంతోత్సవం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా సాయంత్రం వసంతోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను అభిషేకించిన జలాలు (పసుపు, గంధము)తో వసంతాలు చల్లుకుంటూ భక్తులు ఆనంద డోలికల్లో మునిగితేలారు. ప్రభుత్వ విప్, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆలయం వద్ద వేదపాఠశాల పిల్లలతో కలిసి వసంతాలు చల్లుకున్నారు. అనంతరం నిర్వహించిన ఊంజల్‌సేవలో భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.



వసంతోత్సవంలో ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

గజ వాహనంపై మురిసిన మలయప్పస్వామి

శనివారం రాత్రి కల్యాణ వెంకన్న గజ వాహనంపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. విశేష అలంకార భూషితుడైన స్వామి వారు గజవాహనాన్ని అధిష్టించి, ఆలయ మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు.



హనుమంత వాహనంపై శ్రీరామచంద్రుడిగా కల్యాణ వెంకన్న



గజవాహన సేవలో ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి



శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకన్న ఊంజల్ సేవ

29న హుండీ కానుకల లెక్కింపు

కాణిపాకం(యాదమరి):కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయ హుండీ కానుకలను ఈ నెల 29న లెక్కించనున్నట్లు దేవస్థానం చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. ఉదయం 7 గంటలకు ఆలయ ఆస్థాన మండపంలో నిర్వహించే హుండీ కానుకల లెక్కింపునకు ఆలయ అధికారులు, సిబ్బంది హాజరు కావాలని కోరారు.

డిమాండ్ ఉన్న కోర్సులనే ఎంచుకోవాలి

- కలెక్టరేట్‌లో రెండు రోజుల పాటు మల్టీస్కిల్ వర్క్‌షాప్
- పాల్గొన్న మంత్రి ఆర్కే.రోజా



మాట్లాడుతున్న మంత్రి ఆర్కే.రోజా

తిరుపతి అర్బన్: మార్కెట్లో బాగా డిమాండున్న కోర్సుల్లో నైపుణ్యత సాధించాలని పర్యాటక, యువజన, సాంస్కృతిక క్రీడా శాఖా మంత్రి ఆర్కే.రోజా తెలిపారు. కలెక్టరేట్‌లో సెట్విన్ నేతృత్వంలో యువజన సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా శని, ఆదివారాలు రెండు రోజుల పాటు మెగా మల్టీ స్కిల్ వర్క్ షాప్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ఉద్యోగ అవకాశాలు ఎలా పొందాలి?, ఏఏ అంశాల్లో పట్టు సాధించాలనే విషయాలను ఈ వర్క్ షాప్ ద్వారా తెలుసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఉచితంగా శిక్షణ అందిస్తున్న హెచ్‌జీ మీడియా వారికి, త్రివేణి ఆర్ట్స్ వారికి, వారికి సహకరిస్తున్న ప్రవీణ్‌కు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ శిక్షణలో యానిమేషన్, మల్టీ మీడియా అప్లికేషన్స్, ఫొటోగ్రఫీ, వీడియో ఎడిటింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ మార్కెటింగ్, వెబ్‌సైట్ మేకింగ్, పర్సనాలిటీ డెవలప్మెంట్, సాఫ్ట్ స్కిల్స్, మోటివేషనల్ క్లాసెస్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. సెట్విన్ సీఈఓ మురళీకృష్ణ మాట్లాడుతూ వర్క్‌షాప్‌కు హాజరైన యువతకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో సెట్విన్ మేనేజర్ మోహన్ పాల్గొన్నారు.

శుభ్‌శ్రీ వస్త్రాలయ వార్షికోత్సవం



శుభ్‌శ్రీ వస్త్రాలయంలో వస్త్రాలు కొనుగోలు చేస్తున్న కస్టమర్లు

తిరుపతి కల్చరల్: వీవీ మహల్ రోడ్డులోని పీఎంఆర్ ప్లాజాలో ఉన్న శుభ్‌శ్రీ 11వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 50 శాతం డిస్కౌంట్ సేల్ ప్రకటించారు. కాంచీపురం పట్టు, డిజైనరీ శారీస్, టస్సర్, బెనారస్, అన్ స్టిచ్ఛ్ సూట్స్, సల్వార్స్ అండ్ కుర్తీస్ తదితర వస్త్రాలు నూతన డిజైన్లలో వచ్చాయని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఓంప్రకాష్ తెలిపారు. అన్ని రకాల వస్త్రాలపై 50 శాతం వరకు డిస్కౌంట్ ఇచ్చామన్నారు.

ఘనంగా చండీయాగం



పూర్ణాహుతికి పయనమవుతున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య కుటుంబ సభ్యులు

సూళ్లూరుపేట: సూళ్లూరుపేట శ్రీచెంగాళమ్మ పరమేశ్వరి ఆలయంలో ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య–సుభాషిణి దంపతులు కుటుంబ సభ్యులంతా కలిసి అమ్మవారికి చండీయాగాన్ని నిర్వహించారు. ఆలయ ఈఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షణలో శాస్త్రోక్తంగా యాగాన్ని జరిపించారు. రాష్ట్రానికి మరోమారు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని, రాష్ట్ర ప్రజలు చల్లగా ఉండాలని కోరుతూ చండీయాగాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కిలివేటి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. యాగం అనంతరం పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారి మూలవిరాట్టు వద్ద ప్రత్యేక పూజలు చేయించారు. ఈ కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు ముప్పాళ్ల చంద్రశేఖర్ రెడ్డి, వంకా దినేష్‌కుమార్, కర్లపూడి సురేష్‌బాబు, ఓలేటి బాలసత్యనారాయణ, మన్నెముద్దు పద్మజ, నాయుడు కుప్ప నాగమణి, పెనుబేటి మారెమ్మ, వైఎస్సార్‌సీపీ నేతలు జెట్టి వేణుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో రాణింపు



క్రీడాకారులను సత్కరించి జ్ఞాపికలు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

దక్కిలి: విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగితే భవిష్యత్‌లో రాణించవచ్చని వైఎస్సార్‌సీపీ నాయకుడు జగన్ మోహన్‌రెడ్డి తెలిపారు. ఏపీ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాల క్రీడా ప్రాంగణంలో మూడు రోజులుగా జరిగిన వెంకటగిరి నియోజకవర్గస్థాయి క్రీడా పోటీలు శనివారంతో ముగిశాయి. నియోజకవర్గ స్థాయిలో అండర్-14, అండర్-17 బాల బాలికలకు నిర్వహించిన కబడ్డీ, ఖోఖో, వాలీ బాల్, త్రోబాల్, అథ్లెటిక్స్, బాల్ బ్యాడ్మింటన్, టెన్నికాయిట్ తదితర పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులకు జ్ఞాపికలు అందజేశారు. 8 క్రీడల్లో జిల్లాస్థాయి పోటీలకు 196 మంది క్రీడాకారులు, అథ్లెటిక్స్‌కు సంబంధించి మరో 92 మంది ఎంపికయ్యారని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నియోజకవర్గ కోఆర్డినేటర్ సుధాకర్ తెలిపారు. అండర్-17 బాలుర విభాగంలో ఎం చంద్రశేఖర్ (జెడ్పీహెచ్ఎస్, వెంకటగిరి), బాలికల విభాగంలో వై లక్ష్మి(ఏపీఎస్‌డబ్ల్యూ ఆర్ఎస్ దక్కిలి) ఓవరాల్ చాంపియన్‌గా నిలిచారు. అండర్-14 విభాగంలో బీ క్రాంతి నివాస్ (జెడ్పీహెచ్ఎస్, వెంకటగిరి), బాలికల్లో కే నిఖిత (ఏపీఆర్ఎస్, వెంకటగిరి), వీ పవిత్ర (ఏపీ ఎస్‌డబ్ల్యూఆర్ఎస్, దక్కిలి) ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించారు. ఎంపీపీ జీరాజశేఖర్, జేసీఎస్ మండల కన్వీనర్ సీహెచ్ శ్రీ నివాసులురెడ్డి, సర్పంచ్ సీహెచ్ వేమక్క, ఎంపీటీసీ సభ్యురాలు ఎం వెంకటరమణమ్మ, తహసీల్దార్ రమేష్ బాబు, ఎంపీడీఓ ప్రసన్నకుమారి, ఎంఈఓలు వెంకటేశ్వర్లు, జగదీష్‌బాబు, ప్రదీప్, బాబయ్య, పీఏసీఎస్ అధ్యక్షుడు జీ శ్రీనివాసులు, బీ భాస్కర్ నాయుడు, గురుకుల ప్రిన్సిపల్ శ్రీదేవి పాల్గొన్నారు.

అగ్రశ్రేణి పారిశ్రామిక పార్కుల్లో ఒకటిగా శ్రీసిటీ



సజ్జన్ జిందాల్, సంగీత జిందాల్‌తో సమావేశమైన శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి

వరదయ్యపాళెం: దేశంలోని అగ్రశ్రేణి పారిశ్రామిక పార్కుల్లో ఒకటిగా శ్రీసిటీ అభివృద్ధి చెందిందని జేఎస్ డబ్ల్యూ గ్రూప్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సజ్జన్ జిందాల్ కితాబిచ్చారు. శనివారం రేణిగుంట నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో శ్రీసిటీలోని క్రియా యూనివర్సిటీలో జేఎస్‌డబ్ల్యూ అకడమిక్ బ్లాక్ ప్రారంభానికి జేఎస్‌డబ్ల్యూ ఫౌండేషన్ చైర్‌పర్సన్ సంగీత జిందాల్‌తో కలిసి వచ్చిన ఆయనకు శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి పుష్పగుచ్ఛమిచ్చి సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా 2009లో జిందాల్ నేతృత్వంలోని శ్రీసిటీ అసోచామ్ పరిశ్రమకు చెందిన ప్రతినిధుల బృందం జపాన్‌కు వెళ్లిన సందర్భంగా వారి అనుబంధాన్ని శ్రీసిటీ ఎండీ గుర్తుచేసుకున్నారు. క్రియా యూనివర్సిటీలో జరిగిన జేఎస్‌డబ్ల్యూ బ్లాక్ ప్రారంభోత్సవం అనంతరం వారితో శ్రీసిటీ ఎండీ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న శ్రీసిటీ గురించి జిందాల్ తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఇలాగే కొనసాగాలని ఆకాంక్షించారు.

జంతువులను సంరక్షిద్దాం

తిరుపతి అర్బన్: జంతువుల సంరక్షణపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో శనివారం జంతు హింస నివారణ సంఘం తొలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జంతువుల సంక్షేమానికి జిల్లా పంచాయతీల నేతృత్వంలో విరాళాలు ఇవ్వాల్సి ఉంటుందని చెప్పారు. మైనర్ పంచాయతీల నుంచి రూ.100, మేజర్ పంచాయతీల నుంచి రూ.500గా నిర్ణయించినట్టు వెల్లడించారు. జంతువుల అక్రమ రవాణాకు అడ్డుకట్టవేయాలని జిల్లా రవాణా అధికారులను ఆదేశించారు. మరోవైపు జంతు వధశాలల నిర్మూలనకు పోలీస్‌శాఖ తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవికుమార్, అడిషనల్ ఎస్పీ కులశేఖర్, జిల్లా పంచాయతీ అధికారి రాజశేఖర్‌రెడ్డి, జిల్లా సమాచార పౌర సంబంధాలశాఖ అధికారి బాలకొండయ్య, డీఎల్‌డీఓ ఆదిశేషారెడ్డి పాల్గొన్నారు.